## క్లుప్తంగా

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. రామలింగేశ్వరపేట, చినరావూరులో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగుకాల్వలను ప్రతిరోజు బాగు చేయించే విధంగా చూడాలని పలువురు కోరారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

### ఆర్టీసీ కార్గో సేవలు ఉపయోగించుకోండి

ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



తెనాలిఅర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ఏర్పాటు చేసిన కార్గో సేవలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ గురువారం తెలిపారు. గతంలో పార్సిల్ పంపించదలచిన వారు డిపోకు రావాల్సి ఉండేదని చెప్పారు. నూతనంగా కార్గో సేవలను బస్సుల్లో ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బస్సు కండెక్టర్‌కు పార్సిల్‌ను అందజేస్తే వారు ఆయా ప్రాంతాలకు డెలివరీ చేసే అవకాశాన్ని ఉన్నతాధికారులు కల్పించారన్నారు. కండెక్టర్‌కు పార్సిల్ ఇవ్వగానే సెండర్, రీసివర్ ఫోన్ నెంబర్లకు మేసేజ్‌లు కూడా పంపే ఏర్పాటు చేసామన్నారు. జూన్ 1 నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు డిపోలో సంప్రదించాలన్నారు.

### జీవనంలో యోగా భాగం కావాలి



తెనాలి అర్బన్: యోగాను మన జీవనంలో భాగంగా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం, చెంచుపేటలోని ఎస్‌ఎల్‌ఎస్ కల్యాణ మండపంలో గురువారం జరిగిన యోగ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలి

చుండూరు(వేమూరు): ప్రభుత్వం ఉపాధి కూలీలకు గత 8 వారాల నుంచి వేతనాలు విడుదల చేయడం లేదని, వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొనిగల అగస్టిన్ డిమాండ్ చేశారు. చుండూరు మండలంలో ఉపాధి పని ప్రదేశాలలో గురువారం ఆయన పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొని రావడం జరిగిందన్నారు. అధికారులు యోగాలు చేయడం కాదు కష్టపడి పని చేసిన కూలీలకు వేతనాలు విడుదల చేయాలని ఆయన కోరారు. కూలీలకు 100 రోజులు ఉపాధి ఎక్కడా అమలు జరగడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధికి గతం కంటే నిధులు తగ్గించిందని విమర్శించారు. మేట్లుకు పారితోషికం పునరుద్ధరించాలని, పనిలో గాయాలైతే కనీసం మెడికల్ కిట్స్ కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కూలీలకు పలుగు, పార పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### విశ్రాంత ఉద్యోగిపై దాడి

లక్ష్మీపురం: డబ్బులు ఇస్తానని చెప్పి పిలిపించి ఓ రిటైర్డ్ ఉద్యోగిని తీవ్రంగా కొట్టి బంగారం, రూ.4లక్షలు తీసుకుని బెదిరించిన ఘటనలో నిందితులపై నగరంపాలెం పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంటసాల ఆనందరాజు అనే రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయి గుంటూరు కొత్తపేట ప్రాంతంలో నివాసం ఉంటాడు. ఇతనికి పది సంవత్సరాల క్రితం నగరంపాలెం మస్తాన్ దర్గా వెనుక భాగంలో హార్డ్ వేర్ వ్యాపారం చేసే శ్రీనివాసరావుతో పరిచయం అయింది. ఆనందరాజు వద్ద శ్రీనివాసరావు 2024లో రూ.3లక్షలు అప్పుగా తీసుకుని రూ.1.50లక్షలు తిరిగి ఇచ్చేశాడు. మిగిలిన నగదు ఇస్తానని ఈనెల 26న తన హార్డ్ వేర్ షాపునకు పిలిపించిన శ్రీనివాసరావు అతని తనయుడు గోపి మరో ఇద్దరు కలిసి ఆనందరాజుపై భౌతికంగా దాడిచేశారు. బాధితుడి ఒంటిపై ఉన్న బంగారం, రూ.4లక్షలు బలవంతంగా ఫోన్ పే చేయించుకున్నారు. దీంతో ఆనందరాజు ఆసుపత్రిలో చికిత్స పొంది, గురువారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రైవేటు టీచర్ల మెడపై అడ్మిషన్ల కత్తి

- పిల్లలను స్కూళ్లలో చేర్పించాలంటూ టార్గెట్లు
- ఎండల్లో ఇంటింటి ప్రచారం చేయాలని ఆదేశం
- అడ్మిషన్లు తీసుకురాకుంటే జీతం అందనట్టే
- మనోవేదనకు గురవుతున్న ప్రైవేటు టీచర్లు



తెనాలి మండల విద్యాశాఖాధికారి కార్యాలయం

తెనాలిఅర్బన్: విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే అడ్మిషన్ల పేరిట తమ వద్ద పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులను ప్రైవేటు విద్యా సంస్థలు వేధిస్తున్నాయి. మండుటెండల్లో ఇంటింటి ప్రచారం చేసి విద్యార్థులను చేర్పించాలంటూ ఒత్తిడి చేస్తున్నాయి. అడ్మిషన్లను తీసుకురాకుంటే జీతం ఇవ్వబోమని హెచ్చరిస్తున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల తీరుతో ప్రైవేటు టీచర్లు, అధ్యాపకులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక పీజీ, డిగ్రీ, బీఈడీలు చేసిన ఎంతో మంది జీవనం సాగించటానికి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. 2025–28 విద్యాసంవత్సరానికి రెండు నెలల ముందే విద్యార్థుల ప్రవేశాలకు టార్గెట్ విధిస్తూ సిబ్బందిని ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు వేధింపులకు గురిచేస్తున్నాయి.

తెనాలి నియోజకవర్గం పరిధిలోని తెనాలి పట్టణం, మండలం, కొల్లిపర మండలాలు ఉన్నాయి. వీటిలో తెనాలి పట్టణం, మండల పరిధిలో 80 ప్రవేట్ స్కూల్స్ ఉన్నాయి. కొల్లిపర మండల పరిధిలో ఆరు ప్రవేట్ స్కూల్స్ ఉన్నాయి. ఇవి కాకుండా తెనాలి నియోజకవర్గ పరిధిలో సుమారు 21 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఆయా కళాశాలల యాజమాన్యాలు ఇంటింటికీ పంపిస్తున్నారు. వీరు ప్రతి ఇంటికీ వెళ్లి 'మీ ఇంట్లో చదువుకునే పిల్లలు ఉన్నారా? ఉంటే ఏం చదువుతున్నారు? అన్న సమాచారం సేకరిస్తున్నారు. వారిని తమ పాఠశాల, కళాశాలలో చేర్పించండని తల్లిదండ్రులను బతిమలాడుతున్నారు.

**యాజమాన్యాల టార్గెట్లు?**

విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు యజామాన్యాలు టార్గెట్‌లు పెడతున్నాయి. ఒకొక్కరు కనీసం ఐదు నుంచి 10 మందిని చేర్పించాలనే నిబంధన ఏర్పాటు చేశారు. ఇచ్చిన అడ్మిషన్ల టార్గెట్లు పూర్తి చేస్తేనే సెలవుల్లో జీతాలు ఇస్తామనే హెచ్చరికను కొన్ని కార్పోరేట్ విద్యాసంస్థలు జారీ చేసి వారితో బలవంతంగా అడ్మిషన్‌లు చేయిస్తున్నారు. ఇచ్చే అరకొర జీతాలు నిలిపివేస్తారనే భయంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు నానాతంటాలు పడుతున్నారు. భగభగ మండే ఎండల్లో ఇంటింటికీ తిరుగుతూ నానా కష్టాలుపడుతున్నారు. పిల్లలను చేర్పించటం ఒక పని అయితే స్థానికంగా పాఠశాలల నిర్వహణ చూసే బాస్‌లు సిబ్బందితో మాట్లాడే భాష, వారి ప్రవర్తన మరింత ఇబ్బంది పెట్టేలా ఉంటుందని పలువురు ప్రైవేటు ఉపాధ్యాయులు వాపోతున్నారు. అడ్మిషన్ల కోసం నోటికి ఏది వస్తే అది మాట్లాడి మనోభావాలు దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులు**

ఒకవైపు ప్రత్యేక తరగతులలో బోధన, మరోవైపు అడ్మిషన్ల టార్గెట్‌ను పూర్తిచేసే పనిలో ప్రైవేటు, కార్పొరేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర వత్తిడికిలోనై మానసికంగా శారీరకంగా ఇబ్బంది పడుతున్నారు. తమ వేదనను ఎవరికీ చెప్పుకోలేక లోలోపల కుమిలి పోతున్నారు. చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్న సమయంలో ఉన్న ఉద్యోగాన్ని వదులుకోలేక, ఒత్తిడిని తట్టుకోలేక ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు యాజమాన్యాలు చాలీచాలని వేతనాలిస్తూ వారి జీవితాలతో చెలగాట మాడుతున్నాయి.

**ఫీజుల మోత!**

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఈ నిబంధన ఏ ప్రైవేట్ పాఠశాలలో అమలు కావటం లేదు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి నుంచే భారీగా ఫీజులు దండుకుంటున్నారు. టెక్నో, ఈ–టెక్నో, సీబీఎస్‌ఈ, ఐఐటీ కోచింగ్, అబాకస్ స్పోకెన్ ఇంగ్లిష్, కరాటే, డ్రాయింగ్ తదితరాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారాన్ని మోపుతున్నారు. దీనికి అదనంగా యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బూట్లు, సాక్సులు, టై వంటివి ఆయా పాఠశాలల్లోనే అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**



విద్యార్థులను చేర్పించే పని ఉపాధ్యాయులకు లేదు. ఎలా ఎవరైన ప్రవేట్ విద్యాసంస్థల వారు టార్గెట్‌లు ఇస్తే మాకు ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే మేము ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చి వివరణ కోరుతాం. అవసరమైతే చర్యలు కూడా తీసుకుంటాం.

–మేకల లక్ష్మీనారాయణ,
విద్యాశాఖ అధికారి, తెనాలి.

### తెనాలి సమాజం నాటికకు రెండు బహుమతులు



జ్యూరీ బహుమతిని అందుకుంటున్న సమాజం బాధ్యులు

తెనాలి: పల్నాడు జిల్లా సాతులూరులో ఈనెల 24–28వ తేదీల్లో జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఆహ్వాన నాటికల పోటీల్లో తెనాలి సమాజం తొలి ప్రదర్శనలోనే రెండు బహుమతులను అందుకోవటం విశేషం. అద్దేపల్లి–ఆరాధ్యుల ఆర్ట్స్, తెనాలి సమాజం చివరిరోజైన 28వ తేదీ రాత్రి 'ఎవరు' సాంఘిక నాటికను ప్రదర్శించారు. ఉత్తమ 'బాలనటి', ఉత్తమ ప్రదర్శన 'జ్యూరి' బహుమతులను ఈ నాటిక గెల్చుకుంది. ప్రముఖ కూచిపూడి నర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య రచించిన ఈ నాటికకు, పట్టణ నటుడు, దర్శకుడు అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వం వహించారు. నాటిక ప్రదర్శనకు జ్యూరీ బహుమతి రాగా, ఇందులో నటించిన పేరుబోయిన మహితకు ఉత్తమ బాలనటి బహుమతిని అందుకుంది. 'ఎవరు' నాటిక ప్రదర్శించిన మొదటి ప్రదర్శనలోనే రెండు బహుమతులను గెలచుకోవడం పట్ల కూచిపూడి నృత్యగురువు చల్లా యామిని, తెనాలి కళాకారులు ఆరాధ్యుల కన్న, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, పేరుబోయిన మహితను అభినందించారు.

## వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను సత్కరించిన దేసు శ్రీనివాసరావు

తెనాలి: పట్టణంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు నూతన కమిటీ నిబద్ధతతో కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన దేసు శ్రీనివాసరావు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిశారు. తన నియామకానికి తోడ్పడినందుకు పూలమాల, దుశ్శాలువతో సత్కరించి, ధన్యవాదాలను తెలియజేశారు. నూతన కమిటీలోని పాలకవర్గ సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళ్లాలని శివకుమార్ చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మద్దాళి శేషాచలం, కౌన్సిలరు గౌడవర్తి సాయిహరేరామ్, కొల్లా గుర్నాధరావు, గుండా రామకోటేశ్వరరావు, మాలేపాటి తిరుమలేశ్వరరావు, కనమర్లపూడి సుబ్రహ్మణ్యం, పొత్తూరి రాఘవ, ఆలమూరి ఫణి, చుండూరు సాయి, మువ్వల శ్రీనివాసగుప్త, గ్రంధి మాధవరావు, గ్రంధి విశ్వేశ్వరరావు, యిడపలపాటి వాసు, అచ్యుత సాంబశివరావు, భాస్కరుని లక్ష్మీనారాయణ, అన్నవరపు నరసింహారావు, సుగ్గల మల్లిఖార్జునరావు, ఆకి అచ్యుతరావు, గోపు రామకృష్ణ పాల్గొన్నారు.

## జొమాటో కార్మికులపై ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలి

లక్ష్మీపురం: జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులపై పెట్టిన తప్పుడు పోలీసు ఫిర్యాదులను వెనక్కి తీసుకోవాలని గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు సోగా బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో బ్రహ్మయ్య మాట్లాడుతూ బ్లాక్ చేసిన జొమాటో ఐడీలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. కార్మికులకు పీక్ అవర్స్‌లో పే అవుట్ రూ.15 ఇవ్వాలని, నాన్ పీక్ అవర్స్‌లో రూ.10 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పూనుకుంటారని హెచ్చరించారు. గిగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.ముత్యాలరావు మాట్లాడుతూ జొమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా తప్పుడు ఫిర్యాదులు చేయడం బాధాకరన్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, గుంటూరు నగర (తూర్పు కమిటీ) ప్రధాన కార్యదర్శి కట్లగుంట శ్రీనివాసరావు, జొమాటో కార్మికులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శామ్యూల్



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, మున్సిపల్ కార్మికులు

రేపల్లె: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి ఇన్‌చార్జి కమిషనర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకై ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తూ మృత్యువాతకు గురైతే వారి కుటుంబంలోని ఒకరికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు పైబడిన అవుట్‌సోర్సింగ్ కార్మికులను విధుల నుంచి తొలగించి ఆ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాతో పాటు పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలన్నారు. కార్మికులకు ప్రతి నెల ఇవ్వవలసిన కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, చేతి గ్లౌజులు, యూనిఫాం తదితరాలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు.

అలాగే కార్మికులకు ఇంక్రిమెంట్లు, బ్యాంకు రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ కోన శ్రీను, ఏఐటీయూసీ బాపట్ల జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి సింగం వాణిశ్రీ, ఏఐటీయూసీ నాయకులు పడమటి బిక్షాలు, ముత్యాల లక్ష్మణరావు, ఎర్రంశెట్టి పోతురాజు, చుక్కాకుల వెంకటేశ్వరమ్మ, దున్న చిన్నారిబాబు, దున్న కిరణ్, ఎర్రంశెట్టి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## సినిమా థియేటర్లలో తనిఖీలు



థియేటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె: నిబంధనలకు విరుద్ధంగా నడిపే సినిమా థియేటర్‌లపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని రాజ్యలక్ష్మి, బసవేశ్వర థియేటర్‌లలో గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి నిర్వాహకులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అనుగుణంగా మాత్రమే టికెట్‌లు, తినుబండారాలు, పానీయాలు విక్రయించాలన్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. థియేటర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఏటా థియేటర్‌ల లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకుంటూ అన్ని శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌లను తీసుకోవాలన్నారు. ఆయన వెంట వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

### నేడు శిఖరేశ్వరస్వామి ఆలయ జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట

చెరుకుపల్లి: మండలంలోని నడింపల్లి గ్రామంలో వేంచేసియున్న శిఖరేశ్వరస్వామి ఆలయ జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. జీవ ధ్వజస్తంభంతో పాటు అదేరోజు నవగ్రహ, ఇతర మూర్తుల విగ్రహాలు కూడా బ్రహ్మశ్రీ నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో రుత్వికుల ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రతిష్ఠించడం జరుగుతుందని, ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## వేధించిన రౌడీషీటర్ అరెస్ట్


తెనాలిరూరల్: వివాహితను లైంగిక వేధింపులకు గురి చేసి ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కారకుడైన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్ గురువారం తెలియజేశారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ ప్రేమిస్తున్నానంటూ వెంటబడే వాడు. ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడేవాడు. అంతేకాక ఆమెతో తనకు వివాహేతర సంబంధం ఉందని గ్రామంలో ప్రచారం చేశాడు. ఈ నేపథ్యంలో ఆమె ఏప్రిల్ నెల 4వ తేదీన పోలీసులను ఆశ్రయించగా అదే నెల 22వ తేదీన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మరుసటి రోజు 23వ తేదీన బెయిలు రావడంతో గ్రామానికి వెళ్లిన మహేష్ తనను పోలీసులు ఏమీ చేయలేకపోయారని, నీ అంతు తేలుస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన సదరు వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఏప్రిల్ 24వ తేదీన మృతి చెందింది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించడంతో నరసరావుపేట సబ్‌జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కార్డెన్ సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్

మంగళగిరి టౌన్: నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్ తెలిపారు. రత్నాలచెరువులో నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో గురువారం కాటన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 200 నివాసాల్లో సోదాలు చేశారు. పత్రాలు సరిగా లేని, నంబరు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంటుందని అన్నారు. రౌడీ షీటర్లకు ప్రతి ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి సమయాల్లో యువత ద్విచక్రవాహనాలపై అతివేగంగా రాకపోకలు, పాఠశాల ప్రాంతాల్లో మద్యం తాగడం వంటివి స్థానికులు అడిషనల్ ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన అడిషనల్ ఎస్పీ రాత్రి సమయంలో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాసరావు, తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు, మంగళగిరి రూరల్ ఎస్‌ఐ మహేష్, తాడేపల్లి ఎస్‌ఐలు ప్రతాప్, జె.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



ప్లకార్డులతో సీఐ వినోద్‌కుమార్

మంగళగిరి టౌన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఢిల్లీ ఫౌండేషన్ ఫర్ ఎంఎస్‌ఎంఈ క్లస్టర్, సింగపూర్ ఏషియా ఫౌండేషన్, రామచంద్రాపురం త్రిపాఠి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సైబర్ సెక్యూరిటీ శిక్షణ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. పోలీస్ శాఖ కూడా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తూ ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అనంతరం పోలీస్ శాఖ రూపొందించిన ప్లకార్డులను శిక్షణ పొందుతున్న వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఎంఎస్‌ఎంఈ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీనిబాబు, జిల్లా ట్రైనర్ రమేష్‌బాబు, త్రిపాఠి సొసైటీ కార్యదర్శి కొప్పుశెట్టి త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

### వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు(గుంటూరు జిల్లా)

E.P:121/2013 in O.S:213/2012

Between :

బేతాళ జాషువ ---- డి.హెచ్.ఆర్

మరియు

బేతం హైమారావు ---- జె.డి.ఆర్

పై నెంబరు ఇ.పి లో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్ అయిన బేతం హైమారావు యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని పైకోర్టు వారిచే ది.17 06 2025వ ఉదయం గం.10.30ని।।ల లగాయితు వేలం వేయబడునని తెలియజేయడమైనది. కావలసినవారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, తెనాలి సబ్ జిల్లా, తెనాలి మున్సిపల్ బొను సర్వే దాఖలా 12వ వార్డు, [illegible] టి.యస్.నెం 466 య.0.11సెంట్లు మింజుమలె ఆస్తికి హద్దులు, తూర్పు: పిల్లి సోము సుందరరావు స్థలం–19'.9" అడుగులు. దక్షిణం: బేతాళ జాషువా స్థలం–20'.2" అడుగులు. పడమర: మున్సిపల్ రోడ్డు–19'.6"అడుగులు. తిరిగి పడమర: బేతాళ జాషువా మరియు బేతాళ రత్నరాజుల స్థలం–6.0" అడుగులు. ఉత్తరం: మున్సిపల్ బావి భూమి కొంత వరకు మరియు పిల్లి సామియేలు స్థలం 26'.10" అడుగులు. తిరిగి దక్షిణం: బేతాళ జాషువ మరియు బేతాళ రత్నరాజుల స్థలం 15.0" అడుగులు ఈ హద్దుల మధ్య 67.8చ।।గ స్థలం అందుగల పాత ఆర్.సి.సి బిల్డింగ్, డోర్ నెం.4–54–75 చేతి పంపు, కరెంటు మీటరు, లెట్రిన్, బాత్‌రూమ్.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

| | |
|---|---|
| డి.హెచ్.ఆర్. విలువ | : రూ.3,00,000/– |
| అమీనా గారి విలువ | : రూ.22,00,000. |
| యస్.ఆర్.ఓ విలువ | : రూ.15,50,000/– |
| జె.డి.ఆర్ విలువ | : దాఖలు చేయలేదు |
| వేలం తేది | : 17–06–2025 |
| Further Hearing | : 24–06–2025 |

యం.కె.దీనదయాళ్,
డి.హెచ్.ఆర్. అడ్వకేట్, తెనాలి

నోట్ : ది.22–05–2006వ తేదీ ఆసామి బేతాళ జాషువ గారికి రూ.1,00,000/– రిజిష్టరు దనఖా బేతం హైమారావుచే చేయబడి ఓ.యస్.నెం. 120/2017గా శ్రీయుతులు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, తెనాలి నందు రూ.11,03,601/–కు ది.24–03–2023వ డిక్రీ కాబడియున్నది. సదరు డిక్రీ బాకీకి లోబడి పాడుకొనవలెను.

### వాచ్‌మెన్‌పై దాడి.. ఆలస్యంగా వెలుగులోకి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి ఉండవల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌పై జరిగిన దాడి ఆలస్యంగా వెలుగుచూసింది. సేకరించిన వివరాల ప్రకారం.. తాళ్లూరి నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యార్లగడ్డ నాగరాజు, అతని భార్యలక్ష్మిపై కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా బాధితుడి భార్య లక్ష్మి మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్‌లో నివసించే ఓ మహిళ అసభ్యంగా మాట్లాడుతోందని ఆమె అన్నారు. దీనిపై లక్ష్మి నిలదీయగా గుంటూరు నుంచి కొందరిని పిలిపించి తమపై దాడి చేశారని పేర్కొంది. ఈ దాడిలో భర్త నాగరాజుకు ఎడమ చేయి విరిగిందని తెలిపారు. సంఘటనపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, చికిత్స నిమితం విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు లక్ష్మి తెలిపారు.

### మోటార్ల చోరీలను నియంత్రించాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని ఏదో ఒక ప్రాంతంలో నిత్యం పంట పొలాల్లో విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. గురువారం ఉండవల్లి హై సెక్యూరిటీ జోన్‌లో ఉన్న పంట పొలాల్లో విద్యుత్ మోటార్లు చోరీకి గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ.. నిత్యం పోలీసుల బందోబస్తి ఉన్న పంట పొలాల్లో మోటార్లు దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం అన్నారు. ఇక్కడ విధులు నిర్వహించే పోలీసులు అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపై తిరిగేవారిని ప్రశ్నించాలని అన్నారు. అధిక పెట్టుబడితో మోటర్లను రైతులు కొనుగోలు చేస్తున్నారని.. చోరీకి గురైన వాటిని పోలీసులు వెంటనే రికవరీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.